## ప్రత్యేక కార్యాచరణతో పరిష్కరిస్తాం



మెయిన్‌లో...


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 15 జూన్, 2024 | పేజీలు : 04


# ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం...!

### జిల్లా కలెక్టర్, ఎస్‌పి బదిలీ అయ్యే అవకాశం?

### పోలీసు, వైద్య, విద్య, పంచాయతీ రాజ్ శాఖల్లో బదిలీలు...

**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికలు పూర్తయి, ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్ర సర్కార్ పూర్తిస్థాయిలో పరిపాలనపై దృష్టి సారించి, ఐఎఎస్, ఐపిఎస్‌లతో పాటు వివిధ శాఖల్లో సుదీర్ఘకాలంగా ఒకేచోట పాతుకుపోయిన అధికారులు, ఉద్యోగులకు స్థానచలనం చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ స్థానాల్లో సమర్థులైన ఉద్యోగులు, అధికారులను నియమించి జగిత్యాల జిల్లాలో ప్రజాపాలనను ప్రజలకు చేరువచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జిల్లా కలెక్టర్, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్పీ లు జగిత్యాల కు బదిలీపై వచ్చారు. రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న అధికారులు, ఉద్యోగులకు స్థాన చలనం చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌ను ఎన్నికల కమిషన్ బదిలీ చేయగా ఆయన స్థానంలో ఎస్పీగా సన్ ప్రీత్ సింగ్ రాగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు పూర్తి కావడంతో ఆయన బదిలీ ఉండవచ్చని తెలుస్తోంది. అలాగే జిల్లా కలెక్టర్ గత ఏడాది ఫిబ్రవరిలో జగిత్యాలకు బదిలీపై రాగ పాలన పరంగా కొంత మెరుగ్గా ఉండడం రెండు ఏళ్ళు పూర్తికాకపోయిన అధికారులను ఒకేసారి బదిలీ చేసి ప్రభుత్వ మార్కు చూపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే కలెక్టర్ బదిలీ ఉండవచ్చని తెలుస్తోంది. జిల్లా అదనపు కలెక్టర్లు ఇద్దరు ఇటీవలే బదిలీపై వచ్చారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పుప్పాల శ్రీధర్ ఇంచార్జి అధికారిగా విధులు నిర్వహిస్తుండగా ఆయన స్థానంలో నూతన అధికారి రాక తప్పదు. భూముల క్రయ, విక్రయాల్లో ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే రిజిస్ట్రార్ శాఖలో కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న జగిత్యాల జిల్లాలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యే అవకాశాలున్నట్లు ఆశాఖలో చర్చ జరుగుతోంది. జిల్లాలోని అలాగే డివిజనల్ పంచాయితీ అధికారులు (డిఎల్పిఓ) గ్రామ పంచాయితీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై జరిగే విచారణల్లో మెతకవైఖరి అవలంబించారనే ఆరోపణలున్నాయి. దీని దృష్ట్యా బదిలీలు చేయనున్నారని సమాచారం. వైద్య ఆరోగ్య శాఖలో వైద్యాధికారులు, ఉపవైద్యాధికారితో పాటు పలువురూ బదిలీ కానున్నట్లు తెలుస్తోంది. విద్య శాఖలో పూర్తి స్థాయి మండల విద్యాధికారుల పోస్టులు భర్తీ కావాల్సి ఉండగా వాటిపై దృష్టి సారించనున్నారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత కలిగిన పంచాయతీ, రెవెన్యూ శాఖల్లో పనిచేసే ఎంపిఓ, ఎంపీడీఓలు, తహశీల్దార్లు పలువురు బదిలీ కానున్నట్లు తెలుస్తోంది. వీరు ఎన్నికల సమయంలో జిల్లాకు రాగా వారు మళ్ళీ స్వంత జిల్లాలకు వెళ్తారనే చర్చ నడుస్తోంది. ఆటవి శాఖలో జగిత్యాల రేంజ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న ప్రణిత కౌర్ రెండు రోజుల క్రితం హైదరాబాద్ కు బదిలీ అయ్యారు. ఆబ్కారీ, వ్యవసాయ, విద్యుత్, పౌరసరఫరాల శాఖల ఉద్యోగులకు సైతం స్థాన చలనం కలిగే అవకాశాలున్నాయి. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో వ్యవసాయ రంగానికి అనుబంధ శాఖలకు సమర్థులైన ఉద్యోగులు, అధికారులను నియమించేందుకు కసరత్తు చేస్తోంది. జగిత్యాల జిల్లాలో పోలీసు శాఖలో గతంలో కొద్దిపాటి బదిలీలు జరుగగా ఈసారి పెద్ద ఎత్తున సిఐ, ఎస్‌ఐల బదిలీలు జరిగే అవకాశాలున్నాయి. జగిత్యాల పట్టణ సిఐగా విధులు నిర్వహించిన నటేష్ సస్పెండ్ కాగా ఆయన స్థానంలో కొన్ని నెలల క్రితమే సిఐ గా వేణుగోపాల్ జాయిన్ అయ్యారు. గంజాయి మాయమైన సంఘటనలో సారంగపూర్ ఎస్‌లు సస్పెండ్ కాగా అక్కడ దత్తాద్రి ఎస్‌ఐ గా నియమితులయ్యారు. జగిత్యాల రూరల్ సిఐతో పాటు కోరుట్ల నియోజకవర్గంలోని ఇద్దరు సిఐలు, జగిత్యాల నియోజకవర్గంలో నలుగురు ఎస్సైలు, కోరుట్ల నియోజకవర్గంలో ఇద్దరు ఎస్సైలు, ధర్మపురి నియోజకవర్గంలో ఇద్దరు ఎస్సైలతో పాటు జిల్లాలోని మరికొందరు ఎస్సైలు బదిలీ అయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇంకా కొన్ని శాఖల్లో మార్పులు జరిగే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పుడే విజయాలు



### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే క్రమంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పుడే అనుకున్న విజయాలతో పాటు పాఠాలను నేర్చుకోగలుగుతామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దస్గర్‌వాడీ ఉన్నత పాఠశాలలో మ్యూజిక్, డ్రాయింగ్, టైలరింగ్ తదితర శిక్షణను పొందిన విద్యార్థులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలలకు ఎటువంటి అడ్డంకులు, ఆంక్షలు ఉండవని, వాటిని సాధించుకోవాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ విద్యాశాఖ ఆద్వర్యంలో 42 రోజులు దస్గర్‌వాడీ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ శిబిరం ద్వారా సంగీతం, చిత్రలేఖనం వంటి అదనపు బోధన తరగతులకు హాజరైన వారిని కలెక్టర్ అభినందించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు సంగీతం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వడాన్ని చూసి చాలా సంతోషంగా అనిపించిందన్నారు. జీవన ప్రయాణంలో ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయాన్ని గ్రహించాలని, మనం కనే కలలను కలలుగానే మిగలకుండా ఎన్ని అడ్డంకులు, బాధ్యతలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించి నిజం చేసుకునేలా కృషి చేయాలన్నారు. అప్పుడే జీవితంలో నిలదొక్కుకోగలమని, లక్ష్యాలను సాధించే క్రమంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని, అప్పుడే సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు కొత్త పాఠాలను కూడా నేర్చుకోగలమన్నారు. అనంతరం విద్యార్థులు నేర్చుకున్న సంగీతాన్ని వినిపించడంతో పాటు వారు తయారు చేసిన పేపర్ పూలకుండీలు, డ్రాయింగ్స్ కలెక్టర్‌కు బహుకరించారు. కార్యక్రమంలో డిఆర్‌వో పవన్ కుమార్, కోర్స్ డైరెక్టర్ గొట్టె ప్రమోద, కోర్స్ ఇంచార్జి ఏనుగు ప్రభాకర్‌రావు, ఇతర సిబ్బంది, విద్యార్థులున్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా



### ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు

**ప్రజాపక్షం/ చింతలమానేపల్లి :** గ్రామాల అభివృద్ధికి నా వంతు ప్రత్యేక కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 114 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు మంజూరు కాగా స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రతి లబ్ధిదారునికి అదే విధంగా తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని, అలాగే మండలంలో పోడు భూముల సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని, పోడు భూముల సమస్యపరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పోడు రైతుల పరిష్కారం కోసం నిరంతర పోరాటం సాగిస్తామని సంబంధిత శాఖ అధికారులు పోడు రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు కూడా తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండలానికి చెందిన విద్యార్థులు నీట్, ఎంబిబిఎస్, ఐఐటిలలో సీటు సాధించడంతో వారిని సత్కరించి అభినందనలు తెలిపారు. మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నిర్మాణం చేపట్టాలని పాత్రికేయులు వినతి పత్రం సమర్పించగా సానుకూలంగా స్పందిస్తూ ప్రెస్ క్లబ్ నిర్మాణానికి కృషి చేస్తామని, అలాగే పాత్రికేయులకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నానయ్య, జడ్‌పిటిసి శ్రీదేవీ, కో ఆప్షన్ సభ్యులు నజీం హుస్సేన్, డిప్యూటి తాసిల్దార్ మస్కూర్ అలీ, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ఎలముల మల్లయ్య, ధోని శ్రీశైలం, కర్జల్లి మాజీ సర్పంచ్ చౌదరి నానయ్య, నాయకులు చౌదరి రంగన్న, తుకారాం, పవన్ పురోహిత్, నాగపురి మోహన్, దుప్పుల మురళి, కుకడ్కరి రమేష్ కొంపరి సాయి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎండపల్లి వ్యాప్తంగా జోరుగా రియల్ దందా ?



* వ్యవసాయ భూములు ప్లాట్లు గా మార్పు..
* పుట్టగొడుగుల్లా వెలుస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్లు, ప్లాట్లు.
* సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా లేఅవుట్లు
* నాలా కన్వర్షన్ లేకుండానే ప్లాట్లుగా మార్చేస్తున్న రియల్ వ్యాపారులు...!

**ప్రజాపక్షం/ఎండపల్లి :** జగిత్యాల జిల్లా ఉమ్మడి వెల్గటూర్ మండలం నుండి నూతన మండలం గా రూపు దిద్దుకున్న ఎండపల్లి మండలం లో రియల్ దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా గా సాగుతుంది మండల కేంద్రంతో పాటు రాజారాంపల్లి శివారు ప్రాంతాల్లో రియల్ ముసుగులో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను అధిక ధరలకు విక్రయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఒకప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపార రంగం కేవలం నగరానికే పరిమితమైన రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు మండలాలకు, గ్రామాలకు, పల్లెలకు కూడా విస్తరిం చింది,వ్యవసాయ భూములు ఎటువంటి అనుమతి లేకుం డానే ప్లాట్లు గా మార్చి విక్రయిస్తున్నారు. మండలంలో కొంత మంది రైతుల,ఆర్థిక పరిస్థితులు, పంట నష్టం వివిధ కారణా లతో రైతులు తమ భూమలను అమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా భావించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు వీరి అవస రాన్ని ఆసరాగా చేసుకుని వారి దగ్గర నుండి రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు కొనుగోలు చేసి అనుమతు లు లేకుం డానే విచ్చలవిడిగా వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. ఎండపల్లి మండల కేంద్రము పరిధిలో వ్యవసాయ భూమిని నాలా కన్వ ర్షన్ లేకుండానే ప్లాట్లుగా మార్చుతున్నారని స్థానికులు చర్చించు కుంటున్నారు. జిల్లాలో అనుమతు లు లేకుండానే విచ్చలవిడిగా వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపా రులు లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. దీంతో మండల కేంద్రము తో పాటు శివారుల్లోనూ వ్యవసాయ భూములు కనుమరుగవుతున్నాయి. నాలా కన్వర్షన్ లేకుండానే ప్లాట్లుగా మారుస్తూ జోరుగా విక్రయాలు జరుపుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా ప్రజలను మోసం చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు సమీప స్థలాలను కొనుగోలు చేయాలని భావిస్తున్న మధ్యతరగతి ప్రజల ఆశను రియల్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కాసులకు కక్కుర్తిపడి నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. నిబంధ నల ప్రకారం నాలా పన్ను చెల్లించిన తర్వాతనే వ్యవసాయ భూములను లేఅవుట్లు చేసి వ్యవసాయేతర భూములుగా మార్చాలి. మండలంలో మాత్రం పరిస్థితి అందుకు విరు ద్ధంగా ఉంది. ఈ విషయం రెవెన్యూ, పంచాయతీ, అధికారు లకు తెలిసినా పట్టించుకోవడం లేదనీ, అధికారులు స్పందించ చక పోవడం పట్ల రియల్ వ్యాపారులకు అధికారులకు ఏమైనా లోపాయికారీ ఒప్పందం కుదిరిందా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్లాట్లు కొనుగోలు చేసే అమాయకులను మోసగిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. రెవెన్యూ, పంచాయితీ, శాఖల అధికా రులకే అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకునే అధికారం ఉంటుంది. ఇక నైనా అధికారులు స్పందించి వారు ప్రభుత్వ నిబంధనల కు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న ప్లాట్ల వ్యాపారు లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాల కోసం ప్రచారం

**ప్రజాపక్షం/బోథ్ :** పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు బోథ్ మండల కేంద్రలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందాలని అధ్యాపకులు శుక్రవారం మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉచిత పుస్తకాలు,నాణ్యమైన బోధన,స్కాలర్ షిప్ లతో పాటు రెగ్యులర్ అధ్యాపకులతో విద్యా బోధన ఉంటుందని పేర్కొన్నారు. నాలుగు గ్రూప్స్ ఎంపిసి, బైపిసి, సిఈసి, హెచ్ ఈసి తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు ఉన్నాయని తెలి పారు. విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, నాందేవ్, లక్ష్మీ పతి, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూలి పురుగు నివారణకు ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం/ఇచ్చోడ :** నులి పురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్థానిక వైద్యాధికారి ఆకుదారి సాగర్ తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఇచ్చోడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడారు. ఈ నెల 20న అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభు త్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అభ్యసిస్తున్న 19 ఏళ్ల లోపు విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు ఉచితంగా ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నులి పురుగు చాలా ప్రమాదకరమని, వీటి వలన రక్త హీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని స్పష్టం చేశారు.

## హోటళ్లలో సబ్సిడీ సిలిండర్ల పట్టివేత

**ప్రజాపక్షం/ధర్మపురి :** సబ్సిడీపై గృహావసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ సిలిండర్లను అక్రమంగా హోటళ్లు, చికెన్ సెంటర్లలో వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న వారిపై ధర్మపురి రెవెన్యూ, డీటీసీఎస్ అధికారులు కేసులు నమోదు చేసి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. డిటిసి ఎస్ అధికారులు, ధర్మపురి రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేష్, మల్యాల ఆర్ఐ ల ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణంలోని పలు హోటళ్లలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా గృహావసరాలకే ఉపయోగించాల్సిన సబ్సిడీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడటాన్ని గుర్తించారు. సదరు హోటల్ యజమానులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు 14 డెమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్ఐ వెంకటేష్ తెలిపారు. హోటళ్లలో సబ్సిడీ కాకుండా వాణిజ్య సిలిండర్లను మాత్రమే వాడాలని నిర్వాహకులకు సూచించారు.

## జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గొల్లపల్లి మండలం భీంరాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర సతీష్ తెలిపిన వివరాల ప్రకారం భీమ్ రాజ్ పల్లి గ్రమానికి చెందిన సామల హన్మంతు(80) గత ఆరు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గతంలో ఆయన భార్య మరణించగా, జీవితంపై విరక్తి చెంది గురువారం మధ్యాహ్నం తన వ్యవసాయ భూమిలో వేప చెట్టుకు ఉరి వేసుకుని మరణించినట్లు, మృతుని కొడుకు సామల రవి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

## ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరగకుండా జాగ్రత్తలు

* అదనపు కలెక్టర్ రాంబాబు



**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదాలుజరుగకుండా, ప్రకృతి వైపరీత్యాల సంభవానికి ముందే ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ పై వివిధ జిల్లా, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వరదలు, భారీ వర్షాల వలన ప్రమాదాలు, ముంపుకు గురయ్యే ప్రాంతాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరుగాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వలన ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ప్రణాళికలో సిద్ధం చేసుకోవాలని అన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆ దిశగా అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. వర్షాకాలంలో పారిశుధ్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం, రోగాలు ప్రబలకుండా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. త్రాగు నీటి క్లోరినేషన్ నిర్వహించాలని తెలిపారు. చెరువులు, కుంటలు పొంగి పొరలే అవకాశం ఉన్నందున ప్రజల రావానాకు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీఓ లు పి.మధుసూదన్, ఎన్. ఆనంద్ కుమార్, ఎన్.శ్రీనివాస్, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

## ఫిట్నెస్ లేని బస్సులు రోడ్డెక్కితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** ఫిట్నెస్ లేని స్కూల్, కాలేజి బస్సులు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల జిల్లా రవాణా శాఖాధికారి వంశీధర్ హెచ్చరించారు. ఫిట్నెస్ లేని ప్రయివేట్ స్కూల్, కాలేజి బస్సులను శుక్రవారం అధికారులు తనిఖీ చేశారు. బస్సు ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్ , ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అధికారులు తనిఖీ చేశారు. ఫిట్నెస్ లేని స్కూల్, కాలేజ్ బస్సులు తనిఖీ చేసి ఫిట్నెస్ లేని మూడు స్కూల్ బస్సులను సీజ్ చేశారు. ఈసందర్భంగా వంశీధర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 470 స్కూల్, కాలేజ్ బస్సులకు గాను 320 బస్సులు మాత్రమే ఫిట్నెస్ కలిగి ఉన్నాయని మిగతా150 బస్సులు ఫిట్నెస్ చేయించుకోవాలని యజమానులకు సూచించారు. ఇందులో ఏమైనా బస్సులు స్క్రాప్ కు వెళ్లాయా ఇంకా ఎన్ని బస్సులు ఉన్నాయో సమాచారం ఇవ్వాలని యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చామని డిటిఓ తెలిపారు. ఫిట్నెస్ లేని స్కూల్, కాలేజ్ బస్ లు నడిపి పిల్లల జీవితాలతో ఆటలాడుకోవద్దని చెబుతూ వెంటనే ఫిట్నెస్ చేయించుకోవాలని జిల్లా రవాణా శాఖాధికారి వంశీధర్ అన్నారు.



## ఉత్తమ రక్తదాత సుధీర్‌కు సన్మానం



**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని జగిత్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ రక్తదాత చింత సుధీర్ ను సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. జగిత్యాల పట్టణానికి చెందిన చింత సుధీర్ ఆయన మిత్ర బృందం జగిత్యాల చుట్టూ పక్కల యువత కొన్ని బ్లడ్ డోనార్స్ గ్రూప్ గా ఏర్పడి రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నట్లుగానే జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి , ఆర్మూర్, నిజామాబాద్, నిర్మల్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలలో ఏ సమయంలో అయిన రక్తం అవసరం అని సమాచారం తెలియగానే తన మిత్రులతో ఒకరి నుండి మరొకరికి సమాచారం చేరవేసుకొని రక్తదాతలను పంపి, రక్తాన్ని అందించారు. ఇప్పటివరకు రాష్ట్ర స్థాయిలో 6 వేల మందికి పైగా రక్తాన్నీ అందించి ప్రాణదాతగా నిలిచారు. స్వయంగా సుధీర్ 54 సార్లు రక్తదానం చేయగా ఈయన సేవలను గుర్తించి ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని విరుపాక్షి గార్డెన్లో చింత సుధీర్‌ను సన్మానించి ప్రశంశ పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వెంకటేశ్వర్ రావు, డిఎంహెచ్ఓ ఇంచార్జ్ సమీఉద్దీన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ప్రవీణ్, పోషక ఆహార నిపుణులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఇదే గ్రామానికి చెందిన సున్నం రవి(42) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్సై అనిల్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఎస్సై అనిల్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఇదే గ్రామానికి చెందిన రెబ్బటి రాజేందర్ అనే వ్యక్తి సున్నం రవికి రెండు లక్షల రూ.లు అప్పుగా ఇవ్వకుండానే ఇచ్చినట్లు బెదిరించి, కొట్టి సంతకం తీసుకున్నాడని, ఆ డబ్బులను ఇప్పుడే చెల్లించాలని రవిపై ఒత్తిడి తీసుకువచ్చాడు. అదే విధంగా గ్రామానికి చెందిన కనుక జగన్, చెప్పుల శ్రీనివాస్, బంటు గణేష్ అనే ముగ్గురు వ్యక్తులు మృతుడు సున్నం రవి నుండి డబ్బులు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా డబ్బులు తిరిగి ఇవ్వమంటే చంపుతామని బెదిరించినట్లు మృతుడు సున్నం రవి వద్ద దొరికిన సూసైడ్ నోట్‌లో రాసుకున్నాడని, ఈ నలుగురు వ్యక్తుల కారణంగానే మనోవేదనకు గురై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకుంటున్నట్లు మృతుడు సున్నం రవి సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడని ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. కాగా మృతుని భార్య సున్నం లక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

## ప్రతిభ చూపిన ఎంపియుపిఎస్ విద్యార్థులు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** దేశ వ్యాప్తంగా పరీక్ష పే చర్చా 2024 కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి మోదీ ఆన్లైన్‌లో నిర్వహించారు. అందులో పాల్గొని ప్రతిభ చూపిన దట్నూర్ యంపియూపిఎస్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించిన ప్రధానోపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా పరీక్ష పే చర్చ 2024 కార్యక్రమాన్ని ఆన్లైన్‌లో నిర్వహించారు. ఎంపియూపిఎస్ దట్నూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జూపాక సుదర్శన్ మోటివేషన్‌తో 15 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ చూపిన 10 మంది విద్యార్థులకు న్యూఢిల్లీ నుండి ప్రశంసా పత్రాలు ఆన్లైన్‌లో మెయిల్ ద్వారా పంపారు. అందులో ప్రధాన మంత్రి సంతకం ఉండడంతో విద్యార్థులు సంతోషించారు. తాజామాజీ సర్పంచ్ ఆకుల పావని నగేష్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దుంపేటి మంగ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందించారు. అనంతరం వారు విద్యార్థులను ప్రోత్సాహించి ఆన్లైన్‌లో పాల్గొనే విధంగా కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్‌ను అభినందించారు. సుదర్శన్ మాట్లాడుతూ పరీక్ష అనగా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా పరీక్షల్లో ఫోబియా, భయాన్ని తొలగించి మనోధైర్యం కల్పించి పట్టుదలతో ధృడ సంకల్పంతో ఆత్మవిశ్వాసం కల్పించి భావిభారత పౌరులుగా తయారు చేయడమే పరీక్ష పే చర్చా అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఆకుల పావని నగేష్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దుంపేట మంగ, ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, ఉపాధ్యాయులు హరికృష్ణ పాల్గొన్నారు.

## బేటీ బచావో, బేటీ పడావో అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ గ్రామంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్ర బృందం శుక్రవారం రోజున ధరూర్‌లో జరిగిన మదర్ థెరిస్సా వివో మీటింగ్‌కు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత గురించి బేటి బచావో బేటి పడావో పథకం గురించి, ఆడపిల్ల చదువు యొక్క ప్రాముఖ్యత గురించి, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి మొబైల్, సోషల్ మీడియా దుష్ప్రచారం గురించి, బాల్య వివాహాల నిషేధ చట్టం, మహిళా రక్షణ చట్టాల గురించి వివరించారు. హెల్ప్ లైన్‌గా ఈ నెంబర్స్‌కు 100, 112, 181,1457,1098లకు కాల్ చేసి మీ సమస్యలు తెలుపవచ్చని, వాటి గురించి కూడా వివరించారు. సఖి సేవలు, అంగన్వాడీ సేవలు, చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్స్, సీనియర్ సిటిజన్స్ రక్షణ చట్టం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు దేశవేణి గంగాభవానీ, మహిళా సంఘం సభ్యులు, చైల్డ్ హెల్ప్ లైన్ స్టాఫ్, మహిళా సాధికారత కేంద్ర బృందం, గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు.

## అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న సబ్జెక్టులలో గంట వారీగా బోధించుటకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అలీ మోద్దిన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పాఠశాల యందు టిజిటి హిందీ పండిట్ 1, పిజిటి బోటనీ 1 ఖాళీగా ఉన్నాయని, ఎమ్మెస్సి, బిఈడి చేసిన అభ్యర్థులు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని సాతారం, మొగిలిపేట గ్రామాల మీదుగా అర్థరాత్రి వేళ పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ శుక్రవారం తెలిపారు. గ్రామాలలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేపడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అట్టి వారిని పట్టుకుని కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## సొంతగూటికి చేరిన లంకదాసరి కళ్యాణ్

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** చిగురుమామిడి మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ ఆఫీసులో సైదాపూర్, చిగురుమామిడి మండల సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం సిపిఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామిల సమక్షంలో లంకదాసరి కళ్యాణ్ సిపిఐలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, బత్తుల బాబు, చాడ శ్రీధర్ రెడ్డి, కంది రవీందర్ రెడ్డి, వొడ్నాల వెంకటేష్, శ్రీనివాస్, సమ్మయ్య, రాజేశం, ఒజ్జ కొంరయ్య, అనిల్ తదితరులున్నారు.

# ‘రూ.10182.70’ కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక ఖరారు

### గ్రామీణ ప్రాంతాలకు విస్తృత సేవలందించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** 2024/25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.10182.70 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, రికవరీ, పిఎం జిపివై రుణాలు, ఎస్సీ, బిసి, ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖలతో పాటు పలు పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై డిసిసి, డిఎల్ఆర్‌సి సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సంధర్భంగా వార్షిక రుణ ప్రణాళికకు సంబంధించిన బుక్‌లెట్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అవసరాల కోసం రూ. 3673.92 కోట్లు, ఎంఎస్ఎంఈ కింద రూ. 2997.06 కోట్లు, విద్యారుణాలు రూ.44.55 కోట్లు, గృహ రుణాలు రూ.192.00 కోట్లు, ఇతర రంగాలకు రూ.3275.17 కోట్ల రుణాలను బ్యాంకర్లు అందించాలని ఆదేశించారు. 202324 ఆర్థిక సంవత్సరంలో 9927 స్వయం సహాయ బృందాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.64,049.25 లక్షలు అందించాలనేది లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సంవత్సరం మార్చి 31 నాటికి 12010 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.77021.92 లక్షల బ్యాంకు లింకేజీ అందించి 120.25 శాతం లక్ష్యాన్ని సాధించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా రెండవ స్థానం సాధించిందని వెల్లడించారు. ఇందుకు అధికారులు, బ్యాంకర్లను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించేందుకు బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వంద శాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. బ్యాంకర్లు వినియోగదారులు, రైతులకు అత్యుత్తమంగా పనిచేయాలని సూచించారు. రైతులకు పంట రుణాలను అందించాలని, ఇబ్బంది పెట్టవద్దని పేర్కొన్నారు. రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామ గ్రామాన సేవలు మరింత విస్తృత పరచాలని, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తద్వారా బ్యాంకర్లకు మంచి పేరు వస్తుందని తెలిపారు. వినియోగదారులను ఇబ్బంది పెట్టకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ అమాయక ప్రజలు సైబర్ నేరాల్లో చిక్కుకోకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఫోన్లకు వచ్చే గుర్తు తెలియని మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. ప్రధానమంత్రి పార్మాలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పిఎంఎఫ్ఎంఈ) పథకం కింద 180 లక్ష్యం కాగా జిల్లాలో 210 యూనిట్లను గ్రౌండింగ్ చేశామని తెలిపారు. వివిధ కార్యకలాపాల కింద బేకరీ, స్పైసస్, ఫ్లోర్‌మిల్, రోస్టర్ మెషిన్, దాల్‌మిల్, బియ్యం ఆధారిత ఉత్పత్తులు తదితర యూనిట్లను గ్రౌండింగ్ చేశామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూతను అందించేందుకు బ్యాంకర్లు ముందుకు



రావాలని కలెక్టర్ కోరారు. రైతులు తమ రుణాలను రెన్యువల్ చేసుకునే అంశంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు రూ. 9954.20 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాలలో 133.04 శాతం పూర్తయ్యిందని, పెండింగ్‌లో ఉన్న రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లకు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సకాలంలో రుణాలు రికవరీపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. డిఆర్‌వో పవన్ కుమార్, ఎల్డీఎం ఆంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనిఆవస్, పరిశ్రమల శాఖ జిఎం నవీన్ కుమార్, డిఆర్డీవో శ్రీధర్, మెప్మా ఇంచార్జి పిడి స్వరూపారాణి, జిల్లా సహకార అధికారి రామానుజచార్యులు, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ నాగార్జున, ఆర్‌బిఐ అధికారి పల్లవి, నాబార్డు డిడిఎం దిలీప్, ఎస్‌బిఐ ఏజిఎం వెంకటేష్ తదితరులున్నారు.

## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్



విసిలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జిల్లాలో పెండింగ్ ధరఖాస్తుల పరిష్కారానికై ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టి త్వరగా ఫైల్ డిస్పోజ్ చేసేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు .శుక్రవారం హైదరాబాద్ సిసిఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి, ప్రజావాణి ధరఖాస్తుల పరిష్కారం, భూముల మార్కెట్ విలువలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సమీక్షించారు. రాష్ట్రస్థాయిలో మంగళ, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే భూ సంబంధిత సమస్యలను కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్న నేపథ్యంలో జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో నివేదికను అందించాలని పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్, గంగాధరలో అనువైన భవనం, భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఆర్ఎస్ఆర్ ధరఖాస్తులలో తప్పుడు ఎంట్రీ జరిగిందా ధ్రువీకరించి తప్పుడు ఎంట్రీని తొలగించి ఆర్ఎస్ఆర్ సవరణకు రిపోర్టుతో సహా ధరఖాస్తులు పంపాలని సూచించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటి పనులు అప్పుడే పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అవసరమైన మండలాలకు అదనపు సిబ్బందిని కేటాయించి ధరఖాస్తులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. హుజురాబాద్, గంగాధరలలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు భవనం లేదా స్థలాన్ని గుర్తిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, డిఆర్‌వో పవన్ కుమార్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు, కలెక్టరేట్ సూపరిండెంట్‌లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో గల కాన్ఫిరెన్స్ హాలులో జిల్లాలోని వైద్యాధికారులతో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యఆరోగ్య శాఖ అధికారులు, పంచాయతీ అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులను అరికట్టాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టి ప్రజలు డెంగీ, మలేరియా, చికెన్ గున్యా లాంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు నీటి ట్యాంకులను శుభ్రపరిచి, క్లోరినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, నీరు నిలువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండే చోట ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు రాకుండా ఫాగింగ్ చేయాలని, వారానికి రెండు రోజులు



డ్రై డే పాటించాలని తెలిపారు. వర్షాకాలంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రతిరోజూ జ్వరాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జ్వరం కేసులు వచ్చినట్లయితే ఎక్కువ దృష్టి కేంద్రీకరించి తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఆర్‌బిఎస్‌కె బృందాలు జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, పాఠశాలలు, కెజిబివి విద్యాలయాలు, మోడల్ పాఠశాలలను నిరంతరం సందర్శించి విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలపై అవగాహన కల్పించాలని, ప్రసూతి మరణాలపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తుకారాంభట్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన గౌతమ్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొడిమ్యాల :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలానికి చెందిన బిజెపి నాయకులు డబ్బు గౌతమ్ రెడ్డి ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలోని మినిస్టర్స్ క్వాటర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రాజకీయ ప్రస్థానం బిజెపి కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని..నమ్ముకున్న పార్టీ సిద్ధాంతం కోసం ప్రజల కష్ట నష్టాల్లో పాలు పంచుకొని ఎప్పుడూ ప్రజల మధ్యన ఉంటూ సామాన్య కార్యకర్త నుండి కేంద్ర మంత్రిహోదా వరకు వెళ్లడం ప్రతి కార్యకర్తకు ఆదర్శప్రాయులు అని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గణేష్‌కు అవార్డు



**ప్రజాపక్షం/కోరుట్ల :** జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంతో పాటు, ఎనలేని సేవలు చేసిన రక్తదాతలకు అవార్డు సర్టిఫికెట్ ప్రధానోత్సవం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కోరుట్లకు చెందిన సామాజికవేత్త, రక్తదాన సంధానకర్త, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కటుకం గణేష్ ను ఘనంగా అభినందిస్తూ అవార్డు సర్టిఫికేట్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో రక్తదాతలతోపాటు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేస్తూ ప్రజలకు అత్యవసర సమయాల్లో ప్రాణదాతలుగా నిలుస్తున్నారని, దానితోపాటు ఈ యొక్క దాతలు మరి కొంత మంది యువతను రక్తదానంపై అవగాహన కల్పిస్తూ రక్తదానం చేసేలా ఎంతగానో కృషి చేస్తున్నారని, వారి సేవలు వెలకట్టలేమని వారు అభినందించారు. అలాగే రక్తదానం మహాదానం అంటూ అమ్మ జన్మనిస్తే రక్తదాత పునర్జన్మని ఇస్తారని కొనియాడారు.

# కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్ :** కరాటే పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాకు చెందిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా నుంచి కరాటే పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ లతో కలిసి అభినందించారు. గత నెల 19న గోవాలోనీ మనోహర్ పారీకర్ ఇండోర్ స్టేడియంలో యూనివర్సల్ 369 షోటోకాన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2024 పోటీలలో కాల్వ శ్రీరాంపూర్ మండలం జడ్పిహెచ్ఎస్ వెన్నంపల్లి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సిహెచ్.వైష్ణవి, నిహారిక , ఈ.శ్రీనిత , ఈ. శ్రీహర్షిని, 10వ తరగతి చదువుతున్న నిదర్శిని పాల్గొని కాటా విభాగంలో నాలుగు బంగారు పతకాలు, ఆయుధ కాటా విభాగంలో ఒక వెండి, ఒక కాంస్య పతకాలను సాధించగా, వారిని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ లు అభినందించారు.అదేవిధంగా రామగుండంలోని సాక్రెడ్ హార్ట్ హై స్కూల్ కు చెందిన అమృత్ సాయి అనే విద్యార్థి మలేషియాలో నిర్వహించిన పదవ అంతర్జాతీయ ఓకినావా గోజుర్యు ఎపోసిటి కరాటే ఛాంపియన్ షిప్ లో పాల్గొని అండర్ 16 క్యాటగిరిలో బంగారు పతకం, వెటరన్ క్యాటగిరిలో వెండి పతకం సాధించగా సదరు విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కే.శ్రీనివాస్, కరాటే మాస్టర్ కాల్వ రమేష్, కరాటే డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ మొండయ్య పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు గోదావరిలో పడి వ్యక్తి మృతి..

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన రాపర్తి బోజయ్య అనే వ్యక్తి(28) గోదావరి నదికి స్థానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగి మృతి చెందినట్లు ఆయనతో వెళ్లిన స్నేహితులు అక్కడున్న స్థానికులు తెలిపిరు.గజ ఈతగాలతో మృతదేహన్ని బయటకు తీశారు.అనంతరం అక్కడికి చేరుకున్న ఎస్ఐ వివరాలు సేకరించి పంచనామ చేసి దర్యాప్తు చేస్తున్నమని తెలిపారు.

## ప్రతీ ఒక్క విద్యార్థి 10 జిపిఏ సాధించాలి

**ప్రజాపక్షం/లక్ష్మ ణ చందా :** బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లక్ష్మ ణచాంద మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వడ్యాల్ నందు జడ్పిటిసి ఓస.రాజేశ్వర్ పాఠ్యపుస్తకాలను,నోటుబుక్కులను పంపిణీ చేయడం జరిగింది.జెడ్పిటిసి మాట్లాడుతూ విద్యార్థులందరూ పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలని,భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరడం జరిగింది.ఈ రోజు నిర్వహిస్తున్న సామూహిక అక్షరాభ్యాసం లో భాగంగా పాఠశాలను సందర్శించి,తగు విషయాలు చెప్పడం జరిగింది.2024 సంవత్సరం నుండి 10 జిపిఏ సాధించిన లక్ష్మ ణ చాంద,వడ్యాల్ హై స్కూల్ విద్యార్థులకు 2000 వేల రూపాయల చోప్పున ప్రోత్సాహం అందజేస్తాను అని జడ్పీటీసీ అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అశోక్ వర్మ,ఉపాధ్యాయులు పాల్గొన్నాడం జరిగింది.

## ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి గేదె మృతి

**ప్రజాపక్షం/సోన్ :** మండలంలోని జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన అందెడి సాయిరెడ్డికి చెందిన పాలిచ్చే గేదె శుక్రవారం జియో టవర్స్ కు సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్ఫర్ మొక్క ఎర్త్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని దీని విలువ 60వేల రూపాయలు వరకు ఉంటుందని రైతు కన్నీరు మున్నీరయ్యాడు.మృతి చెందిన గేదకు పశువైద్యాధికారి పంచనామ నిర్వహించారు.

## గుడుంబా బట్టీలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి

900 లీటర్ల గుడుంబా ధ్వంసం



**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం బేగంపేట గ్రామంలో గుడుంబా బట్టి లపై శుక్రవారం రామగుండం కమిషనరేట్ ఏరియా టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు.రామగుండం కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశాలతో సీఐ రమేష్ బాబు, ఎస్సై కటికే రవి ప్రసాద్, రాజేష్ ఆధ్వర్యంలో 900 లీటర్ల గుడుంబా బట్టీలను ధ్వంసం చేశారు. నమ్మదగిన సమాచారంతో బేగంపేట్ క్రషర్ ఏరియాల గుట్టలలో గుడుంబా బట్టి లను ఏర్పాటు చేశారని సమాచారం పోలీసులకు అందడంతో ఈ బట్టిలను ధ్వంసం చేసి గుడుంబాను పారబోశారు.పోలీసులను చూసి నిర్వాహకులు పారిపోయారు.ఈ దాడులతో టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్ సంగం రాజేందర్, శ్రీనివాస్, మల్లేష్, మహేందర్, శేఖర్ లు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇపి ఆపరేటర్ ఎంపిక



**ప్రజాపక్షం/రామగిరి :** జిఎం ఆర్.జీ3అంతర్గత ఇ.పి ఆపరేటర్ ట్రైనింగ్ ప్రాక్టికల్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.సుధాకర రావు అన్నారు. శుక్రవారం జి.ఎం కార్యాలయం నందు ఇ. పి ఆపరేటర్ ట్రైనింగ్ పోస్టుల భర్తీకి నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్జీ2,ఆర్జీ3 మరియు ఏ.పి.ఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగులు 332 మంది ఇ.పి ఆపరేటర్ పరీక్ష కొరకు దరఖాస్తు చేసుకోగా, ఇటీవల వారికి హాల్ టికెట్ జారీ చేయడం జరిగినదని, అట్టి అభ్యర్థులకు రామగుండం3 ఏరియా సెంటినరీ కాలనీ లోని రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణము నందు ఈనెల 18 నుండి 20 వరకు జరిగే ప్రాక్టికల్ పరీక్షలు అత్యంత పారదర్శకంగాను,ఎటువంటి అవకతవకాలకు ఆస్కారం లేకుండా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలో హాజరుకావాలని, ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా పరీక్షలకు హాజరుకావాలని తెలియజేశారు. అలాగే రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ వో టూ జీ ఎం జి.రఘుపతి, ఏరియా సేఫ్టీ అధికారి సి. హెచ్. వెంకట రమణ, ప్రాజెక్ట్ అధికారి కే .రాజేందర్, డి జీ ఎం ఐ ఈ డి కే. చంద్ర శేఖర్, సివిల్ డి జీ ఎం పద్మారాజు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి ఇ. లక్ష్మి నారాయణ, ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆర్. శ్రీనివాస్, ఎం.నాగరాజు, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి లతో పాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడారంగంలో రాణించాలే

శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు



**ప్రజాపక్షం/మంథని :** యువత క్రీడారంగంలో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీపాద ట్రస్టు చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన మంథని ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులకు టీ షర్ట్‌లు పంపిణీ చేసిన అనంతరం బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సహాం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. తమకు ఇష్టమైన క్రీడలను ఎంచుకుని ఆ క్రీడలో రాణించాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకెళ్తామని, గ్రామీణ క్రీడల ద్వారా క్రీడాకారుల్లోని ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రీడారంగంలో రాణిస్తే భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవచ్చని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమిలను స్పిరిట్‌గా తీసుకోవాలని, ఓటమి గెలుపుకు నాందిగా బావించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వొడ్నాల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు ముస్కుల్ సురేందర్‌రెడ్డి, అజీంఖాన్, గోటీకారి కిషన్‌జీ, నూకల బానయ్య, వంశీతో పాల్గొన్నారు.

## ఉచిత బ్యూటిషియన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** బ్యూటిషియన్ ఉచిత కోర్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. డి లక్ష్మి నరసింహం అన్నారు. శుక్రవారం కాగజ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా ఉచిత బ్యూటీషియన్ శిక్షణను కోర్సును ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ నైపుణ్య శిక్షణ కింద ఇచ్చే ఈ ఉచిత బ్యూటీషియన్ శిక్షణా కోర్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, శిక్షణ వల్ల విద్యార్థులకు ఎంతో లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. 45 రోజులపాటు నిర్వహించే శిక్షణలో పలు అంశాలు బోధించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త బి. శారద మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత బ్యూటీషియన్ శిక్షణను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. నేటి సమాజంలో ఇలాంటి నైపుణ్య శిక్షణ తీసుకున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పాటు భవిష్యత్తులో వారి కాళ్లపైన వారు నిలబడే దిశగా ఈ కోర్సు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ రాణి, శిక్షణ నిపుణురాలు రవళి, కళాశాల అధ్యాపకురాలు శారద పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలో ఈనెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో గల కాన్ఫిరెన్స్ హాలులో జాతీయ నులిపురుగుల నియంత్రణ కార్యక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ1 నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలు జిల్లాలో 1,73,494 మంది ఉన్నారని, ప్రతి ఒక్కరికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలని సూచించారు. నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవడం వల్ల పిల్లలకు కలిగే లాభాలపై పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలలో విస్తృతమైన అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా విద్య, వైద్య, పంచాయతీ, శిశుసంక్షేమం, గ్రామీణ అభివృద్ధి శాఖలతో సమన్వయంచేసుకుంటూ జిల్లాలోని వందశాతం పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను అందించాలని తెలిపారు. ఏదైన కారణంచేత పిల్లలు ఈనెల 20న మాత్రలు తీసుకోనట్లయితే జూన్ 27న అవకాశం ఉంటుందని తెలిపారు. నులిపురుగుల నివారణ మాత్రలను పిల్లలకు భోజనం చేసిన అనంతరమే అందించాలని, మాత్రలు వేసుకున్న అనంతరం ఇబ్బందులు తలెత్తితే వెంటనే వైద్యులకు తెలియపరచాలని చెప్పారు. పిల్లలకు మాత్రలు అందించే ముందు వారి ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకుని, ఆరోగ్యంగా ఉంటేనే అందించాలని, పిల్లలెవరికీ మాత్రలు ఇంటివద్దకి ఇవ్వకూడదని, చిన్న పిల్లలకి అందించే ముందు మాత్రలను పొడిరూపంలో అందించాలని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా విద్యాశాఖ లైజన్ అధికారి ఉదయ్ బాబు, ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి సజీవన్, బిసి సంక్షేమశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్, జిల్లా ఉప వైద్యాధికారులు, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వేలాడుతున్నా కరెంట్ తీగలు..!



* సెస్ అధికారుల చోద్యం

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలోని వ్యవసాయ పొలం వద్ద కరెంట్ తీగలు చేతికందుతున్నాయి.ప్రాణలతో చెలగాటమాడుతున్న అధికారులు కరెంట్ తీగలు సరిచేయాలని రైతు దాసరిగణేష్ పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించలేదని వాపోతున్నారు.కొత్తకుంట ఏరియాలో లూజ్‌లైన్లు ఉన్నాయని పలుమార్లు పిర్యాదు చేసినా పట్టించుకున్న పాపనా పోవడం లేదని లైన్‌మెన్‌లకు ఖర్చులు భరించి ఇస్తామని లిఖిత పూర్వకంగా లేఖను రాసి ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని అధికారులు నిర్లక్ష్యవైఖరి వీడాలని రైతుల గోస పట్టించుకోండని విన్నవించుకుంటున్నారు.ప్రజాప్రతినిధిగా పని చేస్తున్న గణేష్‌కు రైతుల తరపున తమ అరిగోస చెప్పుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వారి తరపున ఎల్లారెడ్డిపేట ఏఈకి చరవాణిలో కాని కార్యాలయానికి వెళ్ళినా ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదని చెప్పారు.లేదంటే సిరిసిల్లా డీఈ దృష్టికి వెసుకువెళ్తామని అన్నారు.ఎందుకింత నిర్లక్ష్యదోరణి వహిస్తున్నారో అర్థం కావటంలేదన్నారు.లేదంటే రైతుందరం పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు.